క్లుప్తంగా

పదో తరగతి విద్యార్థులకు ఆల్ ద బెస్ట్

సింగరాయకొండ: పదో తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలని, వారికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆల్ ద బెస్ట్ తెలిపారు. ప్రతి విద్యార్థికి పదో తరగతి తొలిమెట్టు అన్నారు. పరీక్షా కేంద్రంలో ఎటువంటి ఒత్తిళ్లకు లోను కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసి మంచి మార్కులు సాధించి తల్లిదండ్రుల ఆశలను నిలబెట్టాలన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

పీసీపల్లి: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొంటారన్నారు. మండలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై కిషోర్‌బాబు

పామూరు: వాహన చోదకులు నిబంధనలను అతిక్రమించి వాహనాలను నడిపితే వారిపై కేసు నమోదు చేసి జరిమానా విధిస్తామని ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపారు. స్థానిక సుందరయ్యభవన్ సెంటర్‌లో ఆదివారం సాయంత్రం వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్సై మాట్లాడుతూ మైనర్లు వాహనాలను నడిపితే భారీ జరిమానా విధిస్తామన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలను నడిపినా, హెల్మెట్ లేకపోయినా, వాహనాలకు ఇన్సూరెన్స్ లేకపోయినా కేసులు నమోదు చేస్తామన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

కనిగిరిరూరల్: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎస్ఎంసీ చైర్మన్ పందిటి మోహన్ అన్నారు. స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులకు ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ పందిటి మోహన్ పరీక్ష సామగ్రిని ఆదివారం అందచేశారు. పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

టంగుటూరు: పిల్లలు విధిగా గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం చేయాలని గ్రంథాలయ నిర్వాహకుడు జి.వర్ధన్‌రాజు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చదవడం మా కిష్టం కార్యక్రమం నిర్వహించారు. పుస్తక పఠనంతో సృజనాత్మకత పెంపొందుతుందన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే జైలుకే



డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తున్న ఎస్సై

కొండపి: మద్యం తాగి వాహనం నడిపితే జైలుకు పంపిస్తామని ఎస్సై ప్రేమ్ కుమార్ వాహనదారులను హెచ్చరించారు. స్థానిక కామేపల్లి సెంటర్‌లో ఆదివారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడుపుతున్న ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకొని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఆయన తెలిపారు. ఏఎస్సై అంకారావు, కానిస్టేబుల్ సుధాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

వృద్ధుడు అదృశ్యం

సింగరాయకొండ: మండలంలోని మూలగుంటపాడు గ్రామానికి చెందిన నక్కా పెద మాలకొండయ్య(70) ఈ నెల 10వ తేదీ కందుకూరు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడని, అప్పటి నుంచి కనిపించడం లేదని కుమారుడు శ్రీనివాసులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు.

కరేడులో బంగారం, నగదు చోరీ

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడు గ్రామంలో చోరీ జరిగిన ఘటన ఆదివారం రాత్రి బయటపడింది. వివరాలు.. గ్రామానికి చెందిన పోకూరి రాఘవులు శెట్టి కుటుంబం శుక్రవారం రాత్రి యాత్రకు వెళ్లారు. వెళ్తూ బంధువులను చూస్తుండమని చెప్పి వెళ్లారు. ఎప్పటిలానే ఆదివారం రాత్రి బంధువులు వెళ్లి పరిశీలించగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. వెంటనే ఇంటి యజమానికి తెలియపరిచారు. బీరువా కూడా పగులగొట్టి నగదు తీసుకుని వెళ్లారు. బీరువాలో సుమారు రూ. 5 లక్షల నగదు, 2 నుంచి 4 సవర్ల బంగారం ఉందని వారు తెలిపారు. వారు యాత్ర నుంచి సోమవారం వస్తారని బంధువులు తెలిపారు. చోరీ జరిగిన ప్రాంతాన్ని ఎస్సై అంకమ్మ ఆదివారం రాత్రి పరిశీలించారు. బాధితులు వచ్చి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

సేవలందక.. పథకాలు ఇవ్వక..

- దిష్టిబొమ్మలుగా సచివాలయాలు
- కూటమి ప్రభుత్వంలో నేటికీ తెరుచుకోని ప్రభుత్వ సేవలు

కొండపి:

మహాత్మా గాంధీ కలలో కన్నా గ్రామ స్వరాజ్యం స్థాపనే లక్ష్యంగా మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పల్లెల అభివృద్ధికి పెద్దపీట వేశారు. ప్రజల వద్దకే పాలన ధ్యేయంగా గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి దేశ చరిత్రలో సరికొత్త విప్లవాన్ని తీసుకువచ్చారు. మండల కేంద్రాలకు వెళ్లకుండా గ్రామంలోని సచివాలయాల్లో అన్ని సేవలు అందేలా చర్యలు తీసుకుంది గత వైస్సార్సీపీ ప్రభుత్వం.. కానీ కూటమి ప్రభుత్వం అంతకంటే మరింతగా ప్రజల వద్దకే పాలన సాగిస్తామంటూ కల్లబొల్లి హామీలతో అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థను పక్కనపెట్టి ప్రజల సేవలకు కోతలు పెట్టింది. అధికారంలోకి వచ్చిన 9 నెలలవుతున్నా ఒక్క ప్రభుత్వ పథకం అందక, సచివాలయాల్లో సేవలు అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజలకు అవసరమైన రేషన్కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, అన్నదాత సుఖీభవ వంటి వెబ్‌సైట్లు ఇప్పటికీ తెరుచుకున్న పాపాన పోలేదు. ప్రజలు ప్రస్తుతం కుల,ఆదాయ ధ్రువపత్రాలు, వన్ బీ వంటి సాధారణ సేవలు మాత్రమే పొందుతున్నారు. దీంతో ప్రజలు కూటమి ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ సేవలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ప్రజలు పెద్ద ఎత్తున విమర్శిస్తున్నారు.



కొండపి గ్రామ సచివాలయం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పల్లెల్లోనే సేవలు అందించేందుకు ప్రతి గ్రామంలోనూ సచివాలయాన్ని ఏర్పాటుచేసి అనుసంధానంగా 50 గృహాలకు ఒక వలంటీర్‌ను నియమించి అన్ని సేవలను ప్రజలకు నేరుగా అందజేశారు. ఒక్కో సచివాలయ భవనాన్ని రూ.45 లక్షలు వెచ్చించి నిర్మించారు. ప్రజలు తమకు వీలున్నప్పుడే సమస్యలు విన్నవించుకునేందుకు సచివాలయాలు ఎంతో ఉపయోగపడేవి. సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్, విద్యుత్ తదితర సేవలు వివిధ ధ్రువపత్రాలు ఆస్తుల రిజిస్ట్రేషన్లు ఆధార్ సేవలు పల్లెల్లోనే పొందేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఈ సేవలు కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాలు వెలవెలబోయాయి. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థను పక్కన పెట్టిన కూటమి ప్రభుత్వం ఉద్యోగులను సైతం తగ్గిస్తోంది.

ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలి...

రేషన్‌కార్డుల వెబ్‌సైట్ ఎప్పుడు తెరుస్తారా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. గతంలో సచివాలయాలకు వెళితే సమాధానం లభించేది. కానీ ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదు. గతంలో ఇంటికే వచ్చే వలంటీర్లు ఏదైనా సమాచారం అడిగితే ఉన్నతాధికారులను అడిగి చెప్పేవారు. కానీ ప్రస్తుతం పింఛన్లు, రేషన్‌కార్డులు వంటిని ఎలా దరఖాస్తు చేసుకోవాలి, ఎప్పుడు చేసుకోవాలో తెలియక అల్లాడుతున్నారు.

పట్టించుకునే వారే లేరు:



గ్రామాల్లో ఏర్పాటైన సచివాలయాలతో గత ప్రభుత్వంలో ప్రజలకు విస్తృతమైన సేవలు అందేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాదిరిగానే ఇప్పుడు కూడా గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సేవలను సచివాలయాల ద్వారా కొనసాగించాలి. గతంలో వలంటీర్లు ఇంటికి వచ్చే సంక్షేమ పథకాలు సర్టిఫికెట్లు వంటి సేవలు అందించేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం తక్షణమే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

వై వీరవసంతరావు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు

ఏ పథకం అందడం లేదు:



గ్రామ సచివాలయ, వలంటీర్ల సేవలు కొనసాగించాలి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై తొమ్మిది నెలలు అయినా ప్రజలకు ఎలాంటి పథకాలు అందడం లేదు. రేషన్ కార్డులతో పాటు పింఛన్ దరఖాస్తు వెబ్‌సైటు తెరిచి ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావాలి

ఓబుల్ రెడ్డి, వైఎస్సార్ సీపీ స్టేట్ ఐటీ వింగ్ జాయింట్ సెక్రటరీ



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దద్దాల నారాయణయాదవ్

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

కనిగిరిరూరల్: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా స్థానిక బొడ్డు చావిడి వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధనలో పొట్టి శ్రీరాములు త్యాగ స్ఫూర్తి చిరస్మరణీయమని కీర్తించారు. ఈ సందర్భంగా పట్టణంలో ఆర్యవైశ్యులు వైఎస్సార్‌సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్‌ను, మున్సిపల్ చైర్మన్ గఫార్‌ను, వాసవీ సత్ర సముదాయాల జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీలు మడతల కస్తూరిరెడ్డి, ఓకేరెడ్డి, గాంధ్లపర్తి ఆదినారాయణరెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, మాదాల వెంకట సుబ్బారావు, దరిశి సుబ్రహ్మణ్యం, మాదాల సూరిబాబు, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, డాక్టర్ ఎస్కే రసూల్, సిరుప వెంకట గోవర్ధన్‌రెడ్డి, తమ్మినేని సుజాత రెడ్డి, తడికమళ్ల వెంకటేశ్వర్లు, దేవకి రాజీవ్, నక్కా రామకృష్ణా, బచ్చు వెంగళరావు గుప్తా, రాచర్ల నరేష్, పైడిమర్రి సుబ్బయ్య, దరిశి ఫణికుమార్, ఎం నాగమణి, సైకం ఏడుకొండలురెడ్డి, వాకుమళ్ల రాజశేఖరరెడ్డి, పల్నాటి భాస్కర్‌రెడ్డి, చింతం శ్రీనివాసుల యాదవ్, గోడి నారాయణరెడ్డి, సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, దేవిరెడ్డి వెంకట స్వామిరెడ్డి, సుస్మిత, షకీలా, జిలానీ, ఈర్ల శ్రీను, కంటు కేశవ, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పీసీపల్లి: మండల పరిధిలోని పొట్టి శ్రీరాములు జన్మస్థలమైన పడమటిపల్లిలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేరకం నాగాంజనేయులు పొట్టిశ్రీరాములు మందిర నిర్మాణానికి భూమిపూజ చేశారు. కమిటీ సభ్యులు పేరకం సుబ్బారావు, శ్రీకాంత్, వెంకట నారాయణ, హేమంత్‌కుమార్, ఏల్చూరి బ్రహ్మయ్య, కొండలరావు పాల్గొన్నారు.

పథకాల అమల్లో పక్షపాతం సహించం

- ఎంపీపీ గంగసాని లక్ష్మి



వ్యవసాయశాఖపై సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీపీ, ఏఓ

పామూరు: ప్రభుత్వ పథకాల్లో పక్షపాతం చూపితే సహించేది లేదని ఎంపీపీ గంగసాని లక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో ఆదివారం ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వగ్గంపల్లె ఎంపీటీసీ రెక్కల అనితా రెడ్డి, చిలంకూరు ఎంపీటీసీ పిడికిటి సుబ్బరత్తమ్మ, గట్లా శివకుమారి, మెడబలిమి ఆదిలక్ష్మమ్మ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి సమస్య లేకుండా చేడాలని, సాగర్‌నీరు సరిగా రావడం లేదని సమావేశం దృష్టికి తేగా దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్ మాట్లాడుతూ బోర్ల మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు. సాగర్‌నీరు మాత్రం జాతీయ రహదారి, ఇతర రోడ్ల నిర్మాణాలతో పైప్‌లైన్ కొత్తవి వేయడం, మరమ్మతుల దృష్ట్యా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ సమస్యను అధిగమించి నీరు సరఫరా చేస్తామని తెలిపారు. దీనిపై ఎంపీపీ మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించి నీటి ఇక్కట్లు లేకుండా చూడాలన్నారు. పామూరులో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఈఓపీఆర్‌ఆర్‌డీ అరవిందకు సూచించారు. వగ్గంపల్లె ఎంపీటీసీ అనిత మాట్లాడుతూ వ్యవసాయ గ్రూపులకు రాయితీలు రావడం లేదని సమావేశం దృష్టికి తీసుకురాగా ఏఓ రాధ సమాధానమిస్తూ రికార్డులు పరిశీలించి చర్యలు వచ్చేలా చూస్తామన్నారు. వైస్ ఎంపీపీ గంధం ఏసురత్నం మాట్లాడుతూ నర్రమారెళ్ల గ్రామకంఠం స్థలానికి సంబంధించి పట్టాలు ఇప్పించాలని కోరగా దీనిపై ఆర్ఐ మల్లికార్జున మాట్లాడుతూ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామన్నారు. కోఆప్షన్ నాయబ్‌రసూల్ మాట్లాడుతూ బాలికల ఉన్నత పాఠశాల మంజూరు చేయించాలని, ఉర్దూ పాఠశాలను విలీనం చేయకుండా చూడాలని కోరగా, తాతాయపల్లెలో పాఠశాల భవనం శిథిలావస్థలో ఉందని సర్పంచ్ రాధాకృష్ణ తెలపగా దీనిపై ఎంఈఓ డీవీ సుబ్బారావు సమాధానమిస్తూ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. మోపాడు రిజర్వాయర్ నీటిని రాత్రిళ్లు వృథాగా వదలుతున్నారని ఇరిగేషన్ అధికారుల దృష్టికితేగా బాధ్యులపై పోలీస్ కేసుకు సిఫార్సు చేస్తామన్నారు. వెలుగు వీఓఏలను అక్రమంగా తొలగించారని, తప్పులను సరిదిద్దాలని ఎంపీపీ ఏపీఎంకు సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌ఆర్‌డి జి.అరవిందారెడ్డి, ఎంపీటీసీ పోలినేని శ్రీనివాసులు, అబ్దుల్, మెడబలిమి గురవయ్య, డాక్టర్ రవళి ప్రియాంక, డాక్టర్ శ్రీసాయి, పీఆర్ఏఈ మస్తాన్‌వలి, ఏపీయం విద్యాసాగర్, ఏపీఓ మాల్యాద్రి, విద్యుత్ ఏఈ జిలానీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, ఎంపీటీసీలు, సర్పంచ్ పాల్గొన్నారు.

సమన్వయంతో ముందుకు సాగుదాం

- వచ్చే ఎన్నికల్లో కనిగిరి కొండపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దాం
- బూటకపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ



దద్దాల నారాయణను సన్మానిస్తున్న పార్టీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ, సీనియర్ నాయకులు

పామూరు: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా, సమన్వయంతో పనిచేసి వచ్చే ఎన్నికల్లో కనిగిరి కొండపై వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసి మరోమారు జగనన్నను ముఖ్యమంత్రి చేసుకుందామని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ మండల కమిటీ ఎంపిక సందర్భంగా నాయకులు, కార్యకర్తల సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలమేరకు, జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, పార్లమెంట్ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కారుమూరి నాగేశ్వరరావుల నేతృత్వంలో నియోజకవర్గంలోని అన్ని మండలాలకు కమిటీలను నియమిస్తున్నామన్నారు. పార్టీ శ్రేణులకు, ప్రజలకు అన్ని వేళలా తాను అందుబాటులో ఉంటానని, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, నిరుత్సాహ పడవద్దని అండగా ఉంటానన్నారు. మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు, రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి వంటి సీనియర్ల సలహాలు సూచనలతో పార్టీని బలోపేతం చేస్తూ మీకోసం సేవకునిగా పనిచేస్తానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మోసపూరిత హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చారని, కానీ 9 నెలల్లోనే చంద్రబాబు నిజస్వరూపం బయటపడిందన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి పార్టీ శ్రేణులంతా సైనికుల్లా పనిచేయాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు హుసేన్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వ పథకాలను కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అమలు చేశామన్నారు. అబద్ధపు హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. రెండో విడత మండలపార్టీ అధ్యక్షునిగా తనకు బాధ్యతలు అప్పచెప్పిన ఇన్‌చార్జ్ దద్దాల రుణం తీర్చుకుంటానాన్నారు. మండల కమిటీ 22 విభాగాల అధ్యక్షులను, పామూరు టౌన్‌కు సంబంధించి 5 విభాగాల అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా పార్టీ అధ్యక్షుడు హుసేన్‌రెడ్డి, జెడ్పీటీసీ, నాయకులు ఇన్‌చార్జ్ దద్దాలను ఘనంగా సన్మానించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి, అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికినివాళులర్పించారు. ఎంపీపీ గంగసాని లక్ష్మి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, గంధం ఏసురత్నం, కోఆప్షన్ నాయబ్‌రసూల్, కల్లూరి రామిరెడ్డి, అంబటి కొండారెడ్డి, గట్లా విజయబాస్కర్‌రెడ్డి, యాదాల సాయికిరణ్, షేక్.చాంద్‌బాషా, షేక్.గయాజ్, జే.గోవిందయ్య, శ్రీరాం శ్రీను, సుభాషిణి, పద్మ, జి.ఆదినారాయణరెడ్డి, ఆవుల బాస్కర్‌రెడ్డి, వి.రాజశేఖర్‌రెడ్డి, ఎ.కృష్ణారెడ్డి, సైకం ఏడుకొండలు, బి.నారాయణరెడ్డి, యం.గురవయ్య, పోలినేని శ్రీనివాసులు, గట్లా శివకుమారి, యం.ఆదిలక్ష్మి, ఆర్.అనిత, పి.సుబ్బరత్తమ్మ, చెనికల శ్రీనివాసులు, పావులూరి నారాయణ, ఆర్.నాగరాజు, తాళ్ల నాగేశ్వరరెడ్డి, కరణం వెంకట్రావు, బారాషరీఫ్, యంఏటీ నాయబ్, యం.రాధాకృష్ణ, పైడాల వెంకటరెడ్డి, మిరియం రామారావు, పాల్గొన్నారు.

వైభవంగా అభిషేకోత్సవం, గోపూజ



నారాయణస్వామి అభిషేకంలో పాల్గొన్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం నారాయణస్వామి అభిషేకోత్సవం అర్చకులు శ్రీమంకాల శివప్రసాద్ వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని గోశాలలో గోపూజ నిర్వహించారు. అనంతరం మహానైవేద్యంతో వేడుకగా భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయ ప్రదక్షిణ చేసి స్వామికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



గోపూజ చేస్తున్న భక్తులు

పరీక్షా కేంద్రాల వద్ద భద్రత చర్యలు చేపట్టాలి

కనిగిరిరూరల్: పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆదివారం డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్‌కు వినతి పత్రం అందచేశారు. మాస్ కాపీయింగ్ జరగుండా తగు భద్రతలను ఏర్పాటు చేయాలని, పరీక్షా కేంద్రాల వద్ద డ్రోన్స్ కెమెరాల పర్యవేక్షణ ఉంచాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సీహెచ్ పవన్ కళ్యాన్, గూడూరి సురేష్, ఇర్ఫాజ్, అఖిల్, ఎం పూర్ణ చంద్రరాజు, నజీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

కనిగిరిరూరల్: పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధమైంది. పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు పూర్తి స్థాయిలో పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోగల 24 పరీక్షా కేంద్రాల్లో 3,486 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కనిగిరిలో 10, హెచ్ఎంపాడు 2, పీసీపల్లి 3, సీఎస్పురం 2, వెలిగండ్ల 2, పామూరు 5 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండనుంది.

కొండపి: పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓ కె.సురేఖ తెలిపారు. మండల కేంద్రంలో మూడు సెంటర్లలో పరీక్షలు జరుగుతాయన్నారు. పొదిలి రోడ్డులోని చాణిక్య జూనియర్ కళాశాలలో 200 మంది, టంగుటూరు రోడ్డులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 231 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 129 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. బాలురు 253 మంది, బాలికలు 307 మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించినట్లు చెప్పారు.

సింగరాయకొండ: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు ఎంఈఓ కత్తి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా మొత్తం 844 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, భాష్యం ఉన్నత పాఠశాల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

మర్రిపూడి: పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ ఎంవీవీ రంగయ్య తెలిపారు. మొత్తం 296 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు చెప్పారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి 30 నిముషాల ముందుగా చేరుకోవాలని సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్లుగా శ్యాంసన్, దశరధ రామిరెడ్డి, డిపార్టుమెంట్ అధికారులుగా వై కృష్ణప్రసాద్, హనుమంతరావులు నియమితులయ్యారన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): మండలంలో 340 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నట్లు ఎంఈఓ బి.నాగేంద్రవదన్ తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 192 మంది, కామేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 148 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు.

హనుమంతునిపాడు: పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓ జి.పెద్దిరాజు తెలిపారు. మొత్తం 284 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ నూతన కమిటీల నియామకం

పామూరు: వైఎస్సార్ సీపీ మండల నూతన అనుబంధ కమిటీలు, పట్టణ కమిటీలను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ ఆధ్వర్యంలో ప్రకటించారు. ఇప్పటికే మండల పార్టీ అధ్యక్షునిగా గంగసాని హుసేన్‌రెడ్డిని పార్టీ నియమించారు. ఇక రైతుసంఘం అధ్యక్షునిగా కొల్లా రమణయ్య, యువజన అధ్యక్షునిగా యాదాల సాయికిరణ్, పంచాయతీరాజ్ విభాగం కందుల శివరామిరెడ్డి, ప్రచార కమిటీ మిరియం రామారావు, వాణిజ్య విభాగం దరిశి సుబ్రమణ్యం, మహిళావిభాగం జమీలాబేగం, సోషల్‌మీడియా షేక్.నాయబ్‌రసూల్, సాంస్కృతిక విభాగం బారాషరీఫ్, ఆర్‌టీఐ చప్పిడి హజరత్‌రావు, వికలాంగుల విభాగం జి.సుబ్బరామయ్య, ట్రేడ్ యూనియన్ బోయళ్ల తిరుపతిరెడ్డి, వాలంటరీ విభాగం పోలు సుధాకర్‌రెడ్డి, అంగన్‌వాడీ చింతలపూడి సుభాషిణి, ఎస్సీసెల్ తాతపూడి రాము, బీసీసెల్ చెనికల శ్రీనివాసులు, ఎస్టీసెల్ ఇండ్లా నందకిషోర్, మైనారిటీ షబ్బీర్‌బాషా, విద్యార్థి విభాగం కోడూరి లక్ష్మీనారాయణరెడ్డి, క్రిస్టియన్‌మైనారిటీ ఎండ్లూరి సాల్మన్, చేనేత విభాగం దండే తిరుపతయ్యలతో పాటు పార్టీ పట్టణ అధ్యక్షునిగా షేక్.చాంద్‌బాషా, యూత్ అధ్యక్షునిగా తుపాకుల ఆంజనేయులు, మహిళా అధ్యక్షురాలిగా ఓరుగంటి ఆదిలక్ష్మి(పద్మ), మైనారిటీ ఎంఏటీ నాయబ్‌రసూల్, బీసీసెల్ చల్లా సుబ్బారావులను నియమించినట్లు పేర్కొన్నారు.

రియాజ్‌ను సత్కరించిన సర్పంచ్



రియాజ్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ అనసూయమ్మ

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పఠాన్ రియాజ్‌ను ఆదివారం పార్టీ క్యాంపు కార్యాలయంలో ఊళ్లపాలెం సర్పంచ్ పాకనాటి అనసూయమ్మ, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఉప సర్పంచ్ కాళహస్తి వెంకారెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు పాకనాటి సుబ్బారెడ్డి, పాలూరి శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీటీసీ బిళ్లా కోటేశ్వరరావు, అరవ శ్రీనివాసులరెడ్డి, అప్పాడి విజయకుమార్, శేషారెడ్డి, రమణారెడ్డి, బిళ్లా శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం కేసు నమోదు

సింగరాయకొండ: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో నివసిస్తున్న చల్లా మమత (13) ఈ నెల 14వ తేదీనుంచి కనిపించడం లేదని తల్లి శివకుమారి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర పేర్కొన్నారు.